
# మొదటి పండుగ

**వాణిశ్రీ**




**బసవరాజు పెళ్ళి మే నెల మంటల్లో జరిగింది. అదీ ఎక్కడా? ఎండల రికార్డులు బద్దలుకొట్టే రెంటచింతలలో. హైదరాబాద్ వాతావరణానికి అలవాటుపడిన బసవరాజు రెంటచింతల ఎండలకి హడిలిపోయాడు. ఎంత కూలర్లు పెట్టినా వుక్కపోతతో వుక్కిరిబిక్కిరయ్యాడు. పెళ్ళి తనది గనుక అస్సూ, వుస్సూ అని నిట్టూర్పులు విడుస్తూ, గంట గంటకీ శరీరాన్ని నీళ్ళతో తడుపుకుంటూ కాలం గడిపాడు.**

అప్పుడే మనసులో ప్రతిజ్ఞ చేశాడు. 'ఇక జన్మలో అత్తగారింటికి రాకూడదు'. కానీ దసరా పండుగ దగ్గరపడింది. బసవరాజు మామ గుర్నాథం ఫోన్ చేశాడు.

"అల్లుడుగారూ! మొదటిపండుగ. తప్పకుండా రావాలి"

"వూ...అలాగే" అన్నాడు.

"ఏవండీ ఎప్పుడెల్దాం మా వూరికి?" బసవరాజు ఆఫీసునుంచి ఇంటికి రాగానే ఎదురొచ్చి అడిగింది వాసంతి.

"మీ వూరికా? ఎందుకు?" అని ముఖం చిట్లించాడు బసవరాజు.

"ఎందుకేంటండీ? మొదటి పండుగ. మా నాన్న ఫోన్ చేశాడు. మీకు కూడా చేశాడట గదా?" అన్నది వాసంతి.

"ఆ..చేశాడుగానీ నాకు వీలు కాదు" అన్నాడు.

"అయ్యో! ఎలాగండీ మొదటి పండుగకి.." అని వాసంతి అంటూ వుండగా చిర్రెత్తుకొచ్చిన బసవరాజు గట్టిగా అరిచాడు.

"మొదటి పండగ..మొదటి పండగ అంటావేంది నా బొంద?"

"అదికాదండీ..మన పెళ్ళయిన తర్వాత వచ్చిన పండగ అని అర్థం" వివరించింది వాసంతి.

"సరేగానీ మీ వూళ్ళో ఒక్కటే ఎండ. ఉక్కపోత. నాకు వూపిరాడదు. నేనురాను" అన్నాడు బసవరాజు.

"ఇప్పుడేం ఎండలండీ? వర్షాలు కురుస్తుంటేను"

"ఆ! వర్షాలు కురుస్తుంది ఇక్కడ. మీ వూళ్ళో చినుకు రాలడం లేదంట. పేపర్లో రాస్తున్నారు"

"పండగకి అమ్మానాన్నలతో గడపాలని ఎంతో ఆశపడ్డాను. మా తమ్ముడ్ని, చెల్లెల్ని చూసి ఎంతో కాలమైనట్లుంది" అంటూ కళ్ళొత్తుకుంది వాసంతి.

బసవరాజు కరిగిపోలేదు.

ఆ రాత్రి వాసంతి బిగుసుకుపోయింది. వంటి మీద చెయ్యివేస్తే విదిల్చికొట్టింది.

"తలనొప్పిగా వుంది. వంట్లో బాగాలేదు" అన్నది.

తను పండుగకి వెళ్ళడానికి సుముఖంగా లేనందున వాసంతికి కోపం వచ్చిందని గ్రహించాడు. ఆమెకు కోపం వస్తే ఒక పట్టాన తగ్గదు. మాటా పలుకూ లేకుండా ముఖం గంట్టుపెట్టుకుని మూగదైపోతుంది. బతుకు దుర్భరం చేస్తుంది.

బసవరాజు మనసులోనే లెక్కలేసుకున్నాడు. తను, భార్య వెళ్తే బస్సు ఛార్జీలు ఐదొందలు అవుతాయి రాను పోను. మహాఅయితే తనకొక జతబట్టలు పెడతారు. అంతేగదా! హైదరాబాద్ నుంచి రెంటచింతల పోవడానికి రైలు రూట్ లేదు. ఖర్మ. బస్సులో చావాలి. ఐదారు గంటలు బస్సులో, రోడ్డు మీద దుమ్మంతా మొఖాన కొట్టుకుంటూ, కుదుపులకు వళ్ళంతా హూనమవుతూ..దుర్భరం. వెళ్తే ఎలా? వెళ్ళకపోతే ఎలా?

బుర్ర వేడెక్కిపోయింది. ఆలోచించగా, ఆలోచించగా ఒక ఐడియా తట్టింది. అత్తనీ, మావనీ ఇక్కడికే రమ్మంటే పోలా? వాళ్ళ బస్సు ఛార్జీలు వాళ్ళే పెట్టుకుంటారు. పోతారు. తనకు మహాఅయితే తిండి ఖర్చు తగులుతుంది. మహావుంటే మూడురోజులు వుంటారు, తింటారు పోతారు.

'వెరీగుడ్' తన ఐడియా సూపర్బ్. బసవరాజుకి హుషారొచ్చింది.

"వాసంతీ! నాకొక ఐడియా వచ్చింది" మర్నాడు ఉదయం కాఫీ ఇస్తున్న ఆమెతో అన్నాడు బసవరాజు.

వాసంతి మాట్లాడలేదు. ఆమెకు మూడ్ ఆఫ్ అయి వుంది. పుట్టింటికి వెళ్ళే ఛాన్స్ మిస్ చేస్తున్నందుకు అతగాడి మీద అలిగింది. రాత్రి ఎటూ పస్తు వుంచింది. ఇంకొన్ని రోజులు అలాగే పస్తులుంచితే దారికొస్తాడని నమ్మకం. అందుకే అంటీ ముట్టనట్లు ప్రవర్తిస్తోంది. తన నిరసన గమనించి నీరుకారకపోతాడా?

"పండక్కి మీ అమ్మానాన్నల్ని మనింటికే పిలుద్దాం. హేపీగా గడిపి వెళ్తారు. ఏమంటావు?" భార్య ముఖంలోకి చూస్తూ అన్నాడు.

అతను వూహించినట్లే ఆమె ముఖం తామరపువ్వులా విచ్చుకుని కళకళలాడిపోయింది. దీపావళి మతాబాలా వెలుగులు విరజిమ్మింది.

"నిజంగా! హాయ్! మీరెంత మంచివారండీ" అని బసవరాజుని అల్లుకుపోయింది వాసంతి.

* * *

అల్లుడి ఆహ్వానం అందుకున్న గుర్నాథం ఎగిరి గంతేశాడు.

మొదటి పండక్కి వచ్చిన అల్లుడు ఎన్ని గొంతెమ్మ కోరికలు కోరతాడో? ఏమేమి డిమాండ్లు ముందుంచుతాడోనని వర్రీలోవున్న గుర్నాథం హాయిగా వూపిరి పీల్చుకున్నాడు.

"మా అల్లుడు ఎంత మంచివాడో?" అంటూ తనకు వచ్చిన ఆహ్వానం సంగతి చుట్టాలకు, పక్కాలకు చెప్తూ పొగిడాడు. గుర్నాథం అదృష్టానికి అందరూ అసూయపడ్డారు. అల్లుడి మంచితనం, తెల్లనికాకులు లేవని కవి చెప్పిన సత్యం, అసత్యమైంది కదా అనుకున్నారు.

దసరా మూడు రోజులుందనగానే బయల్దేరి అల్లుడింటికి వచ్చారు సతీ, సుతుల సమేతంగా గుర్నాథం. తల్లిదండ్రుల్ని, తమ్ముడు, చెల్లెల్ని చూసి తెగ ఆనందపడిపోయింది వాసంతి.

బసవరాజు వుండేది హైదరాబాద్ శివారు కూకట్‌పల్లిలో. పేరుకి పల్లేగాని ఇప్పుడు పది ఆమడల పట్నమైంది. జనంతో కిటకిటలాడుతూ, తెల్లవారు జామునుంచే బస్సులు, కార్లు, ఆటోలతో రోడ్లన్నీ జామైపోయి మనుషులు నడవడమే కష్టంగా వుంది.

"ఏం జనం? ఏం జనం? రోడ్లన్నీ కిటకిటలాడి పోతున్నాయి" అన్నాడు గుర్నాథం వస్తూనే.

"ఏందవమ్మా! అలా చిక్కిపోయావు?" అంటూ ఆరా తీసింది తిరుమలెంకమ్మ కూతుర్ని.

"అక్క అంతలా వూరిపోతే, చిక్కిపోయిందంటావేం దమ్మా?" అన్నాడు రాజబాబు.

"నోర్ముయ్ వెధవా! ఎంతమాట పడితే, అంతమాటనడమే! పళ్ళూడగొడతా!" అని కసురుకుంది కొడుకుని.

"అక్కా! ఇక్కడే బాగున్నావే! రంగొచ్చావు. నీ బుగ్గలు గారెల్లా వూరాయి" అన్నది త్రిపురసుందరి.

ముసి ముసి నవ్వులు నవ్వింది వాసంతి. నిద్ర లేవక ముందే వచ్చిన మావగారి కుటుంబాన్నీ, వాళ్ళ సూట్‌కేసులు, బ్యాగ్స్‌ని చూసి ముఖం చిట్లించాడు బసవరాజు. పండుగకి వచ్చేటప్పుడు కేన్ల నిండా అరిసెలు, లడ్డూలు, బూందీ వంటి పిండివంటలు వండుకొచ్చిన దాఖలా కనిపించలేదు. అంటే అన్నీ ఇక్కడే వండుతారా? అని హడలిపోయాడు.

అంతా స్నానాలు చేసి డైనింగ్ టేబుల్ మీదకు వాలిపోయారు. రాత్రే అట్లపిండి రుబ్బి ఫ్రిజ్‌లో పెట్టింది వాసంతి. కిచెన్‌లో అట్లుపోయడం మొదలుపెట్టింది. వాళ్ళంతా తిని బెడ్‌రూమ్‌లోకెళ్ళి నిద్రొస్తుందంటూ పడుకున్నారు.


బసవరాజు టిఫిన్ తినడానికి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు. ఉప్మా ప్లేటు తెచ్చి ముందు పెట్టింది వాసంతి.

"నిమ్మకాయ కొయ్యమన్నారా?" అన్నది.

బసవరాజుకి వళ్ళు మండిపోయింది. అతనికి ఉప్మా పడదు.

"దోసెలు ఏమయ్యాయి?" అని అడిగాడు.

"పిండి అయిపోయిందండీ! నాకే మిగల్లేదు. అమ్మా వాళ్ళకే సరిపోయింది" అన్నది వాసంతి విచారం వ్యక్తం చేస్తూ.



"ఓర్నాయనో... కిలోపిండి నలుగురు లాగించేశారా? ఏం మనుషులు?" అని గొణుక్కున్నాడు.


బసవరాజు ఆఫీసునుంచి ఇంటికి బయల్దేరుతూ వుండగా వాసంతి సెల్లుకి రింగ్ చేసింది.

"ఏవండీ! రేపు ఆఫీసుకి సెలవు పెట్టిరండి. తమ్ముడు జూపార్కుకి వెళ్దామని గొడవ చేస్తున్నాడు" అన్నది.

"ప్రత్యేకంగా సెలవుపెట్టడం ఎందుకు? ఎల్లుండి నుంచి వరసగా నాలుగురోజులు సెలవులున్నాయిగా?" అన్నాడు బసవరాజు.

"ఉంటే వున్నాయిలే! చెప్పినట్లు సెలవుపెట్టిరండి" అని విసుక్కుంది వాసంతి.

జూపార్కు ప్రోగ్రామ్‌కని తెల్లవారు జామునే లేచి పులిహోర, దద్దోజనం తయారుచేసి కేన్లలో సర్దారు తల్లీ కూతుళ్ళు. అక్కడ తినడానికి పేపరు




ప్లేట్లు, డిస్పోజబుల్ గ్లాసులు, నీళ్ళసీసాలు సిద్ధం చేశారు.

"ఏవండీ! ఇవన్నీ మోసుకుని బస్సులో వెళ్ళడం కష్టం. గ్రీన్‌క్యాబో, ఎల్లో క్యాబో పిలవండి. హాయిగా వుంటుంది" అని సలహా ఇచ్చింది వాసంతి.

నిజమే! బస్సులో మనిషి నిలబడ దానికి చోటు దొరకడమే కష్టం. ఇంత లగేజీతో ఎలా? కానీ బసవరాజుకి డౌటొచ్చింది. కనీసం ఐదొందలు అవుతుంది. మావగారు ఇస్తాడా? లేదా? తన నెత్తిన వేస్తాడా?

బసవరాజు డౌటే నిజమైంది. క్యాబ్ దిగిన మావగారు కేన్లు తీసుకుని గేటు దగ్గరికి బయల్దేరాడు. అంతా ఆయన్ని ఫాలో అయిపోయారు. బసవరాజు చచ్చినట్లు పర్సు బైటికి తీసి ఐదొందలనోటు సమర్పించుకున్నాడు.

"ఏవండీ! తొందరగా టిక్కెట్లు తీసుకురండి" అని కేకలు పెట్టింది వాసంతి.

బసవరాజు బుక్కింగ్ కౌంటర్ దగ్గరికి నీరసంగా బయల్దేరాడు.

★ ★ ★



## సరికొత్త ఐశ్వర్య!

**ఐశ్వర్యారాయ్** మెల్లగా అవార్డుల రూటులోకి వెళ్తోందా? ఏమో అలాగే అనిపిస్తోంది అంటున్నారు బాలీవుడ్ జనాలు. తాజాగా ఆమె శ్యాంబెనెగల్ సినిమాకి 'ఓకే' చెప్పిందిట. శ్యాంబెనెగల్ సినిమాలు చాలావరకు ఎలా వుంటాయో అందరికీ తెలుసు. శ్యాం సినిమాలో ఐష్ నటించడానికి అంగీకరించింది అంటే నటనకు ఎంతో అవకాశం వున్న పాత్రే అయి వుంటుంది. ఐశ్వర్య లాంటి టాప్ స్టార్ శ్యాం సినిమాలో తన సత్తాని ఎలా చాటుకుంటుందో చూడాలి!

పగలంతా జూపార్కులో తిరిగి అలసిపోయిన బసవరాజు గాఢంగా నిద్రపోతుంటే లేపేసింది వాసంతి.

"ఈ రోజు దుర్గాష్టమి. లేవండి. తలంటుస్నానం చేయాలి"

విసుక్కుంటూ లేచాడు బసవరాజు. తిరుమలెంకమ్మ పిండివంటలు చెయ్యాలని సరుకుల లిస్టు రాసిచ్చింది. అది చూసి బసవరాజు గుండె చెరువైంది.

"పంచదార, బెల్లం, శెనగపిండి, మినపప్పు ఒక్కోటి మూడేసి కిలోలు. వంట నూనె పదిహేను కిలోల డబ్బా!"

"ఇంట్లో ఏవైనా ఫంక్షన్ చేస్తున్నావా?" అని అడిగాడు బసవరాజు.


"అదేం లేదు"

"మరెందుకు ఇన్నేసి కిలోలు?"

"ఎందుకేంటండీ? అమ్మా వాళ్ళున్నన్నాళ్ళు తింటారా? ఇరుగుపొరుగు వాళ్ళకి పంపించాలా?

వాళ్ళు వెళ్ళిపోయినా మనకి వుంటాయి" తేలిగ్గా అన్నది వాసంతి.

సరుకులకి సూపర్ బజార్లో మూడువేలు బిల్లు చూసి గుడ్లు తేలేశాడు బసవరాజు. వాసంతి తల్లితో కలిసి రెచ్చిపోయి గారెలు, బూరెలు, లడ్డూలు, కారం బూందీ అంటూ చేస్తూ ఇంటిని మిఠాయికొట్టులా మార్చేసింది. ఇల్లంతా నూనె వాసనతో బసవరాజు కడుపులో తిప్పుతోంది. వాంతి అయ్యేట్టుందని టెర్రస్ పైకి పోయి కూర్చున్నాడు.




కాసేపటికి రాజబాబు, త్రిపురసుందరీ పైకి వచ్చారు.

"బావా బావా! రేపుసిటీ టూర్‌కి టిక్కెట్లు బుక్ చేసి రమ్మంది అక్క!" అన్నాడు రాజబాబు.

బసవరాజు వంటికి పల్నాడు మిరపకారం పూసుకున్నట్లు మండిపోయింది.

"నాకు నీరసంగా వుందోయ్! రాలేను" అన్నాడు.

"నువ్వు రాకపోతే మాకేంది? మేం వెళ్తాం. టిక్కెట్లు తీసుకురా బావా!" అన్నది త్రిపురసుందరి.

"సిటీ టూర్‌కి మనవెందుకు వాసంతీ! మీ వాళ్ళని పంపిద్దాం" అన్నాడు బసవరాజు.

వాసంతి వినిపించుకుంటేగా?

"భలేవారండీ! మనం లేకుండానా? మనం దగ్గరుండి అన్నీ చూపిద్దాం. బాగుండదు లేకపోతే" అని సెంటిమెంట్‌తో కొట్టింది.

ఇక తప్పలేదు సిటీటూర్. బస్సు ఆగిన చోటల్లా "బావా! చిప్స్. బావా చాక్లెట్లు. బావా మొక్కజొన్నల కండెలు" అని రాజబాబు, త్రిపురసుందరీ వేధించుకు తిన్నారు.

గుర్నాథం జేబులో చెయ్యిపెట్టడం లేదు. ఆయనే అల్లుడైనట్లు తను మామ అయినట్లు, అంతా తల్లకిందులైంది బసవరాజు పరిస్థితి. టూర్ ఖర్చు మూడువేలు దాటేసరికి బెంబేలెత్తిపోయాడు.

స్నో వరల్డ్‌కనీ, వాటర్ వరల్డ్‌కనీ తీసుకెళ్ళి బసవరాజు బ్యాంక్ బ్యాలెన్స్ ఖాళీ చేశారు బామ్మర్ది, మరదలు.

"ఏవండీ! మా వాళ్ళకి బట్టలు కొనాలి. ఆరెస్ బ్రదర్స్‌కెళ్దామా? చందనా బ్రదర్స్‌కెళ్దామా? కళా మందిర్‌కెళ్దామా? చెప్పండి" అన్నది వాసంతి గోముగా.

"బట్టలేంటి?" అన్నాడు మతిపోయినవాడిలా చూస్తూ.

"ఔనండీ! పండక్కి రమ్మని పిలిచింది మనం. పిలిచి మర్యాద చెయ్యకపోతే మర్యాదగా వుంటుందా? రెంటచింతల వెళ్ళాక మీ అల్లుడేం పెట్టాడు పండక్కి అంటే ఏం చెప్తారు మా వాళ్ళు" అన్నది వాసంతి ముఖం మాడ్చుకుని.

బసవరాజుకి క్రెడిట్‌కార్డు బైటకు తీయక తప్పలేదు. పదివేల చిల్లరకు బ్యాండుపడిపోయింది ఎకౌంట్‌లో. వీళ్ళెప్పుడు పోతారో? శనిలాగా పట్టుకున్నారు అని వాపోయాడు. పండుగ వెళ్ళిన రెండో రోజు బస్సుకి టిక్కెట్లు రిజర్వ్ చేయమన్నది వాసంతి. పండక్కి పిల్చింది మనం. వాళ్ళని డబ్బు అడిగితే బాగుండదు అని వాయించింది.

గుర్నాథం బయల్దేరుతూ "పండక్కి మావూరొస్తే బాగుండేది అల్లుడుగారూ" అంటూ నవ్వాడు.

"ఆయనకి మనూళ్ళో ఎండంట నాన్నా!" అని ముసి ముసి నవ్వులు నవ్వింది వాసంతి.

"నాన్నా! బావ రామోజీ ఫిలింసిటీకి తీసుకెళ్ళనే లేదు" అని బుంగమూతి పెట్టింది త్రిపురసుందరి.

"బావకి తీరికేది పాపం. వారం రోజులు మనతోనే వున్నారాయె. ఆఫీసుకెళ్ళొద్దూ" అని సానుభూతి చూపించింది తిరుమలెంకమ్మ అల్లుడిమీద.

"పెద్ద పండగ సంక్రాంతికి మళ్ళీ వస్తాంగదమ్మా! అప్పుడు రామోజీ ఫిలిం సిటీ చూపిస్తార్లే. ఆ టైంలో ఎగ్జిబిషను కూడా వుంటుందట" అన్నాడు గుర్నాథం.

"అంతేలెండి అల్లుడిగారికి మన వూరి ఎండలు పడవాయె. పండగలకి మనమే వస్తుందాం సరదాగా!" అన్నది తిరుమలెంకమ్మ.

బసవరాజు గుండె ఆగిపోయింది.

## విజయ్‌కుమార్ విజయం

**గత ఏడాది కమల్‌హాసన్ నటుడిగా చిత్రసీమలో 55 ఏళ్లు పూర్తి చేసుకుంటే ఇప్పుడు మరో నటుడు విజయ్‌కుమార్ 50 ఏళ్లు పూర్తిచేసుకున్నాడు. నిన్నటి ఆగస్టు 28న తన 61వ వసంతంలోకి అడుగుపెట్టిన విజయ్‌కుమార్ తన పదో ఏట బాలనటుడిగా సినీజీవితాన్ని ఆరంభించి, హీరోగా ఎదిగి క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఇప్పటికీ రాణిస్తున్నాడు. తమిళనాటే కాకుండా తెలుగు ప్రేక్షకుల్లో కూడా తనదైన గుర్తింపు తెచ్చుకున్న విజయ్‌కుమార్‌కి ఇద్దరు భార్యలు. నటి మంజులని రెండో భార్యగా పెళ్లాడిన విజయ్‌కుమార్ రెండు సంసారాల్లోనూ ఎలాంటి గొడవలూ లేకపోవడం విశేషం.**

